ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు

ఇండ్లు రాలేదని పంచాయతీకి తాళం

ఖమ్మం జిల్లా బచ్చోడులో మహిళల నిరసన

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 30 : ధనికులు, భూములు ఉన్న వారికి, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇండ్లు మంజూరు చేశారని ఆరోపిస్తూ పలువురు మహిళలు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలె మండలం బచ్చోడు గ్రామపంచాయతీ కార్యాలయానికి బుధవారం తాళం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడిసెలు, రేకుల ఇండ్లల్లో ఉన్న వారికి ఇండ్లు ఇవ్వకుండా ధనికులకే మంజూరు చేశారని మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఇండ్ల కోసం దివ్యాంగుల ఆందోళన

ఖమ్మం జిల్లా ముదిగొండలో నిరసన

ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ముదిగొండ, ఏప్రిల్ 30 : ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తమకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం దివ్యాంగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు కోసం ఎంపిక చేస్తున్న జాబితాలో ఒక్క దివ్యాంగుడు కూడా లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం దివ్యాంగులకు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం(ఎల్) పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులను నిలదీస్తున్న దరఖాస్తుదారులు

ఇండ్ల కోసం జీపీ ఎదుట ఆందోళన

- గోవిందాపురం-ఎల్ కార్యదర్శి నిలదీత

బోనకల్లు, ఏప్రిల్ 30 : అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆ పార్టీ నాయకులనే మంజూరు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం(ఎల్)పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, సీపీఎం నాయకులు మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 24 ఇండ్లను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉన్నత వర్గాలకే ఇచ్చారని ఆరోపించారు. తాము గుడిసెలు, రేకుల షెడ్లలో ఉంటున్నా ఇండ్లు ఎందుకు మంజూరు చేయలేదని పంచాయతీ కార్యదర్శి మురళిని నిలదీశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చొప్పాలలో గ్రామస్థుల ఆందోళనతో వెనుదిరిగిపోతున్న అధికారులు

అనర్హులకు ఒక్క ఇల్లు ఇచ్చినా ఊరుకోం

చొప్పాలలో గ్రామస్థుల నిరసన

కరకగూడెం, ఏప్రిల్ 30 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, అనర్హులకు ఇస్తే ఊరుకునేది లేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం చొప్పాల గ్రామస్థులు హెచ్చరించారు. చొప్పాల పంచాయతీ పరిధిలో 24 మందికి ఇండ్లు మంజూరయ్యాయని బుధవారం సర్వేకు వచ్చిన అధికారులు వివరించగా.. వారు నిరసన తెలిపారు. అర్హులను పక్కనపెట్టి.. భూములు, ఉద్యోగాలు ఉన్న వారికి ఇండ్లు ఎలా మంజూరు చేశారంటూ వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. స్థానికుల ఆందోళనతో అధికారులు వెనుదిరిగారు.

ఇందిరమ్మ ఇండ్ల లొల్లి

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం వెంకట్రాపురంలో వాగ్వాదం చేసుకుంటున్న ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థులు

- నర్సింగాపురంలో తన్నుకున్న కాంగ్రెస్ నాయకులు
- అర్హులను విస్మరించారని నెల్లికుదురులో ధర్నా
- వెంకట్రాపురంలో కమిటీ సభ్యులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం

నెల్లికుదురు/కొడకండ్ల/బయ్యారం, ఏప్రిల్ 30 : ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల గొడవలు చోటుచేసుకున్నాయి. జనగామ జిల్లా కొడకండ్ల మండలం నర్సింగాపురంలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను ఎంపీడీవో ప్రదర్శించగా, కొందరు తమ పేర్లు రాకపోవడంతో మండిపడ్డారు. ఓ కాంగ్రెస్ నాయకుడు స్పందిస్తూ 'నా పేరు రాకపోవడానికి కారకుడివి నువ్వేనని మరో నాయకుడిపై గొడవకు దిగడంతో ఒకరికి గాయాలయ్యాయి.

నెల్లికుదురులో ధర్నా

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడులో అనర్హులకు పెద్దపీట వేశారని గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు మురుగుండ్ల ఎల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు మాట్లాడుతూ.. భూమి ఉండి, ఇండ్లు ఉన్న వారినే ఎంపిక చేశారని ఆరోపించారు. బయ్యారం మండలం వెంకట్రాపురంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. దీంతో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వివాదం నెలకొనగా పోలీసులు రావడంతో గొడవ సద్దుమణిగింది.



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెంకటాపురంలో ఇందిరమ్మ ఇండ్లపై విచారణ జరుపుతున్న అధికారులు

ఇందిరమ్మ ఇండ్ల విచారణ నిలిపివేత

- ఎమ్మెల్యే పీఏ ఫోన్‌తో బ్రేక్ : డీటీ వెల్లడి
- మా కార్యకర్తలకే ఇండ్లు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుల బెదిరింపు

తొర్రూరు, ఏప్రిల్ 30 : అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో మాత్రం విఫలమవుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని 29 గ్రామాల నుంచి 49,300 మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేస్తే కేవలం నాలుగు వేల మందిని అర్హులుగా గుర్తించింది. చివరికి ఎల్-1 జాబితాలో 600 మందిని ఎంపిక చేసింది. వెంకటాపురంలో ఇటీవల కాంగ్రెస్ నేతల ఒత్తిడితో ఇండ్ల విచారణను అధికారులు అర్ధాంతరంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో బాధితుడు కొండయాకన్న మాట్లాడుతూ 'నా తల్లి పేరు మీద ఇల్లు మంజూరైంది. నేను బీజేపీకి చెందిన వాడినన్న కారణంతో అధికారులను బెదిరించి విచారణను నిలిపివేశారు' అని ఆవేదన వ్యక్తం చేశాడు. వెంకటాపురంలో మంజూరైన 17 ఇండ్లలో 13 ఇండ్లకు మాత్రమే విచారణ జరిపి, మిగతా నాలుగు ఇండ్లకు విచారణ ఆపివేయడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తొర్రూరు డిప్యూటీ తహసీల్దార్ నరసయ్యను వివరణ కోరగా వెంకటాపురానికి మంజూరైన 17 ఇండ్లకుగాను 13 ఇండ్లకు విచారణ జరిపినట్టు చెప్పారు. మిగిలిన వాటిపై విచారణ ఆపాలని ఎమ్మెల్యే పీఏ ఫోన్ చేసి చెప్పడంతో విచారణ నిలిపివేసినట్టు పేర్కొన్నారు.

ఇల్లెందులో ఇందిరమ్మ ఇండ్ల గొడవ

- డబ్బులు తీసుకున్నారంటూ దూషించుకున్న కాంగ్రెస్ నాయకులు, 'ఇందిరమ్మ సభ్యులు'

ఇల్లెందు, ఏప్రిల్ 30 : నిరుపేదలమైన తమకు ఇండ్లు ఇవ్వకుండా.. కాంగ్రెస్ నాయకులకు మాత్రమే మంజూరు చేయడాన్ని నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని 3వ వార్డుకు చెందిన ప్రజలు బుధవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులను నిలదీశారు. వార్డులో నిరుపేదలైన 13 మందికి ఇండ్లు మంజూరైనట్టు సర్వేకు వచ్చిన అధికారులు తెలిపారు. నిరుపేదలకు ఇండ్లు ఇవ్వకుండా.. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించడంతో అధికారులు వెనుదిరిగారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల మధ్య ఇండ్ల కేటాయింపుపై గొడవ జరిగింది. ఇల్లు మంజూరుకు డబ్బులు తీసుకున్నారంటూ పరస్పరం దూషించుకున్నారు.

వరంగల్ జిల్లా రామోజీకుమ్మరిగూడెంలో ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం ఇంకెప్పుడు కొంటరు?

- వరంగల్ జిల్లా రామోజీ కుమ్మరిగూడెంలో రైతుల ఆందోళన

వర్ధన్నపేట, ఏప్రిల్ 30 : వరి కోతలు ప్రారంభమై 20 రోజులైనా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదంటూ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామోజీ కుమ్మరిగూడెం రైతులు బుధవారం ఆందోళన వ్యక్తంచేశారు. పంటను కోసి ధాన్యాన్ని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద రాశులు పోసుకున్నా అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ లేదని మండిపడ్డారు. గతేడాది జరిగిన కొనుగోళ్లలో తప్పులు జరిగాయని ఈ ఏడాది కేంద్రాన్ని నిలిపివేయడం సరికాదని అన్నారు. వర్షానికి ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం దామరచర్ల కొనుగోలు కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మిల్లర్ల దోపిడీపై రైతుల ఆందోళన

- భద్రాద్రి జిల్లా దామరచర్లలో నిరసన

చంద్రుగొండ, ఏప్రిల్ 30 : తేమ శాతం ఉన్న ధాన్యాన్ని దింపుకోవడానికి మిల్లర్లు నిరాకరిస్తున్నారంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం దామరచర్ల లోని కొనుగోలు కేంద్రంలో రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను నిలువు దోపిడీ చేస్తున్న మిల్లర్లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం లారీల కొద్దీ ఎగుమతికి సిద్ధంగా ఉన్నదని, అయినా మిల్లర్లు కొర్రీలు పెట్టడం వల్ల కాంటాలు సక్రమంగా జరగడం లేదని మండిపడ్డారు. క్వింటా ధాన్యానికి 5 నుంచి 7 కిలోల వరకు అదనంగా కాంటా వేస్తేనే దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు బెదిరిస్తున్నారని రైతులు వాపోయారు. ఇంత జరుగుతున్నా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మిల్లర్ల దోపిడీ ఆపకపోతే రోడ్డెక్కుతామని హెచ్చరించారు.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధర్నా చేస్తున్న రైతులు

తడిసిన ధాన్యం కొనాల్సిందే

- మహబూబాబాద్ జిల్లా మరిపెడ రైతుల డిమాండ్

మరిపెడ/చిన్నగూడూరు, ఏప్రిల్ 30: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం తెచ్చి పది రోజులైనా కొనుగోలు చేయడం లేదని, వర్షానికి ధాన్యం తడిసిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు, ఏవో వాణి

ధాన్యం కొనాలంటూ రైతుల ధర్నా

కూసుమంచి, ఏప్రిల్ 30 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ క్రాస్‌రోడ్డు వద్ద ఖమ్మం-సూర్యాపేట పాత రహదారిపై సీపీఎం నాయకులతో కలిసి రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. ధాన్యం కొనుగోలు సమస్యను పరిష్కరిస్తామని కూసుమంచి ఎస్సై నాగరాజు, మండల వ్యవసాయాధికారి ఆర్ వాణి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తప్పుల తడకగా రేషన్‌కార్డులు!

- ఒకచోట దరఖాస్తు చేసుకుంటే మరోచోట మంజూరు చేసిండ్రు
- అత్తగారి ఊర్లో దరఖాస్తు చేస్తే అమ్మగారి ఊర్లో పేర్లు ప్రత్యక్షం
- కొన్నిచోట్ల అర్హుల పేర్లూ గల్లంతు
- సివిల్‌సప్లై ఆఫీసులకు బాధితుల క్యూ

హైదరాబాద్, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): ఒక వ్యక్తి తన పిల్లల పేర్లను రేషన్‌కార్డుల్లో జత చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పిల్లల పేర్లు తన గ్రామంలో కాకుండా తన అత్తగారి గ్రామంలో, అత్తగారి రేషన్‌కార్డులో నమోదయ్యాయి! మరో ఉదాహరణలో భార్యాభర్తలు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేయగా, భర్తకు తన సొంత గ్రామంలో, భార్యకు అమ్మగారి ఊర్లో రేషన్ కార్డు వచ్చింది. మరో వ్యక్తి తన ఇద్దరి పిల్లల పేర్లను జత చేయడానికి దరఖాస్తు చేయగా ఒక్కరి పేరే నమోదైంది. ఈ విధంగా కొత్త రేషన్‌కార్డుల జారీలో చిత్రవిచిత్రాలు వెలుగు చూస్తున్నాయి. ఒకచోట దరఖాస్తు చేస్తే మరోచోట పేర్లు ప్రత్యక్షమవుతున్నాయి. అత్తగారింట్లో దరఖాస్తు చేస్తే అవ్వగారింట్లో వస్తున్నాయి. పిల్లల పేర్లు ఒకచోట, తల్లిదండ్రుల పేర్లు మరోచోట, భర్త పేరు ఒకచోట, భార్య పేరు మరోచోట దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల అర్హులైనవారి పేర్లు కూడా గల్లంతవుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త రేషన్‌కార్డులను జారీచేయడంతోపాటు కుటుంబ సభ్యుల పేర్లు జత చేయడం, తొలగింపు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఇందుకోసం గ్రామసభలతోపాటు మీ-సేవ కేంద్రాల్లోనూ దరఖాస్తులు తీసుకున్నది.

అధికారుల నిర్లక్ష్యం

కొత్త కార్డులు, పేర్ల నమోదు ప్రక్రియలో సివిల్‌సప్లై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. దరఖాస్తుల పరిశీలన సమయంలో ఒక ప్లాన్ లేకుండా ఇష్టారీతిన అన్నింటినీ కలిపేశారని తెలిసింది. కంప్యూటర్ ఆపరేటర్లకు మొత్తం దరఖాస్తులను అప్పగించడంతో ఈ గందరగోళం జరిగినట్టు సమాచారం. దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేసే క్రమంలో ఇంటి పేర్లను, ఆధార్‌కార్డులను జత చేయడంతో ఈ తప్పులు జరిగినట్టు తెలిసింది. ఆధార్ కార్డుల్లో వారి ఇంటి పేర్లు ఉండటంతో అత్తగారింటికి బదులుగా అమ్మగారి ఊర్లో పేర్లు జతైనట్టు సమాచారం.

దరఖాస్తుదారుల పరుగులు

గ్రామాల్లో రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితాలు వెల్లడించడంతో అవి చూసిన దరఖాస్తుదారులంతా షాక్‌కు గురయ్యారు. పది పేర్లలో కనీసం ఐదారు పేర్లు తప్పుల తడకగా ఉన్నట్టు తెలిసింది. దీంతో ఆయా లబ్ధిదారులు సివిల్‌సప్లై, ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తప్పులపై అధికారులను ప్రశ్నిస్తే, 'మళ్లీ దరఖాస్తు చేసుకోండి. ఇక్కడికొచ్చి ఇబ్బంది పెట్టొద్దు' అంటూ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చేసేదేమీ లేక దరఖాస్తుదారులు ప్రస్తుత జాబితాలోని పేర్ల తొలగింపునకు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆ తర్వాత మళ్లీ ఎక్కడ తమకు రేషన్‌కార్డు కావాలో అక్కడ దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ విధంగా ఒక్క వ్యక్తి రేషన్‌కార్డు కోసం రెండు మూడుసార్లు దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొత్త కార్డులు ఎప్పుడిస్తారో..?

కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి అర్హులైన వారి జాబితాను ప్రకటిస్తున్న ప్రభుత్వం.. వారికి కొత్త కార్డులు ఎప్పటినుంచి జారీ చేస్తారు? ఎప్పటినుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తారు? అనే అంశంపై స్పష్టత కరువైంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జనవరి 26 నుంచే కొత్త రేషన్‌కార్డులు అందాలి. ఆ తర్వాత గడువును ఉగాదికి పొడగించింది. కానీ, ఇప్పటివరకు కొత్త కార్డులు జారీ కాలేదు.

ఇదో రకం ఇసుక దోపిడీ..!

- ఇసుక బజార్లకు పోకుండా దారి మళ్లింపు
- అధికారులు, రవాణాదారులు కుమ్మక్కై ప్రైవేటుగా విక్రయం
- టీజీఎండీసీ వేదికగా సర్కారు ఖజానాకు భారీ గండి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఇసుక బజార్లు... రాష్ట్ర ప్రభుత్వం సామాన్యుడికి ఏదోమేలు చేస్తున్నామంటూ గొప్పగా చెబుతూ ప్రారంభించిన ఈ ఇసుక కేంద్రాలు ఇప్పుడు ఇసుక మాఫియాకు మరో అస్త్రంగా మారాయి. క్వారీల నుంచి నేరుగా ఇసుక బజార్లకు తరలించి ప్రభుత్వమే ప్రజలకు విక్రయిస్తుందంటూ ఏర్పాటు చేసిన ఈ బజార్ల ద్వారా నిర్మాణదారులకు ఇసుక సరసమైన ధరలకు లభించకపోగా... మునుపు దళారులకు చెల్లించాల్సిన దానికంటే ఎక్కువ ఆర్థిక భారం పడుతున్నది. దీనికితోడు మూసీ నుంచి తెచ్చిన ఇసుక కూడా ఇక్కడ దర్శనమిస్తుండటంతో నిర్మాణదారులె వరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు రవాణాదారులు అధికారులతో కుమ్మక్కై మరో కొత్త రకం ఇసుక దోపిడీకి శ్రీకారం చుట్టారు. గిరాకీ లేక ఇసుక బజార్లలో గుట్టలుగా నిల్వలు పేరుకుపోయినా... ఈ బజార్ల పేరిట నిత్యం లారీలకొద్దీ ఇసుక మాత్రం క్వారీల నుంచి తరలివెళుతున్నది. ఇసుక బజార్ల పేరిట తీసుకువస్తున్న నిల్వలను దారి మళ్లించి బ్లాకులో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అందునా ఓవర్‌లోడ్ కూడా తోడవటంతో సర్కారు ఖజానాకు భారీ ఎత్తున గండి పడుతున్నది.

యథేచ్ఛగా అక్రమ దందా..

ఇసుక బజార్లకు తరలాల్సిన ఇసుక పక్కదారి పడుతున్నది. అధికారులు, రవాణాదారులు కుమ్మక్కై క్వారీల నుంచి ఉచితంగా తరలిస్తున్న ఇసుకను నిర్మాణదారులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాదు, అమ్మ్యాయాలు దండుకుంటూ ఓవర్ లోడింగ్‌కు కూడా అనుమతిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడమే కాకుండా.. ఆశించిన మార్పు రావడం లేదు. కొద్దిరోజుల క్రితం ఇసుక సంస్కరణల పేరుతో హడావుడి చేసిన అధికారులు.. ఇప్పుడు అక్రమంగా ఇసుకను అమ్ముకుంటూ జేబులు నింపుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమాలను అరికట్టే పేరుతో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) గత మార్చి 16 నుంచి నెలరోజుల వ్యవధిలో అబ్దుల్లాపూర్‌మెట్, బోరంపేట్, వట్టినాగులపల్లి, ఆదిభట్ల తదితర చోట్ల శాండ్ బజార్లను ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఇసుకను క్వారీల నుంచి శాండ్ బజార్లకు తరలించి దొడ్డు ఇసుక టన్నుకు రూ.1600, సన్న ఇసుక టన్నుకు రూ.1800 చొప్పున విక్రయానికి ఉంచారు. జీఎస్టీతోపాటు శాండ్ బజార్ నుంచి ఇంటివరకు తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చులు కలుపుకుని టన్ను ఇసుక ధర రూ. 2000వరకూ అవుతున్నది. అంతేకాదు, శాండ్ బజార్లలో మూసీ నుంచి తెచ్చిన మట్టి ఇసుకను విక్రయానికి ఉంచడంతో వినియోగదారులు కొనేందుకు ముందుకు రావడంలేదు. దీంతో అన్ని శాండ్ బజార్లలో ఇసుక గుట్టలుగుట్టలుగా పేరుకపోతున్నది. శాండ్ బజార్లలో ఇసుకను కొనే దిక్కులేకున్నా క్వారీల నుంచి ఇసుక రవాణా మాత్రం ఆగడంలేదు. అసలు ఈ ఇసుక ఎక్కడికి వెళ్తుందని గమనిస్తే... నేరుగా వివిధ ప్రాంతాల్లోని కన్‌స్ట్రక్షన్ సైట్లకు చేరుతున్నట్టు తేలింది. కొందరు అధికారులు, ఇసుక రవాణాదారులు కుమ్మక్కై శాండ్ బజార్ల పేరుతో ఇసుకను తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. శాండ్ బజార్ల పేరుతో తరలిస్తున్న ఇసుకకు ఎలాంటి వేబిల్లులు ఉండడం లేదు. అంతేకాదు, ఒక్కో లారీలో 50 టన్నుల వరకూ తరలిస్తున్నారు. కొందరు లారీ యజమానులు టీజీఎండీసీ కార్యాలయంలోనే తిష్టవేసి ఈ అక్రమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

మామూళ్ల మత్తులో జోరుగా ఓవర్‌లోడ్..

ప్రైవేటు మార్కెట్‌లో విక్రయించే లారీలకు సంబంధించి ఒక్కో లారీకి 30-35 టన్నులకంటే ఎక్కువ అనుమతించేది లేదని గొప్పలు చెప్పిన అధికారులు, ఇప్పుడు అమ్మ్యాయాల మత్తులో ఓవర్ లోడింగ్‌ను కూడా అనుమతిస్తున్నారు. క్వారీల వద్ద కాంట్రాక్టర్లు రూ.1000చొప్పున అమ్మ్యాయాలు వసూలు చేస్తూ 45-50టన్నుల వరకు లోడింగ్ చేస్తుండగా, కాంటా దగ్గర ఉండే కాపలాదారులు రూ. 500చొప్పున వసూలు చేసి కాంటా పెట్టకుండానే వదిలేస్తున్నారు. ఇలా ఒక్కో లోడుకు రూ. 1500ఖర్చు చేస్తే 15నుంచి 20 టన్నుల వరకు అక్రమంగా అదనపు ఇసుక తెచ్చుకునే అవకాశం లారీ యజమానులకు కలుగుతున్నది. దీంతో ప్రైవేటుగా విక్రయించే లారీ యజమానులు కూడా ఒక్కో లోడుకు రూ. 1500చొప్పున లంచాలు ఇచ్చుకుంటూ ఓవర్ లోడింగ్ తెచ్చుకుంటున్నారు. ఇలా శాండ్ బజార్ల పేరుతో అధికారులు, ఓవర్ లోడింగ్ ద్వారా లారీల యజమానులు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. సంస్కరణల పేరుతో మూడు నెలలపాటు ఇసుకకు కృత్రిమ కొరతను సృష్టించి టన్ను ఇసుక రూ. 2200-2400వరకూ పెరిగేలా చేసిన అధికారులు.. ఇప్పుడు ఆంక్షలన్నీ గాలికొదిలి స్వలాభం కోసం పాటుపడుతుండడం విమర్శలకు తావిస్తున్నది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం దామరచర్ల కొనుగోలు కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు